సాగు చట్టాలపై రైతులతో చర్చలకు సిద్ధం : రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 19: వివాదాస్పద వ్యవసాయ చట్టాలను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమర్థించారు. ఈ చట్టాల్లో తమ ప్రయోజనాలకు భంగకరంగా ఉన్నాయని రైతులు భావించిన క్లాజులపపై ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని అన్నారు. సాగు చట్టాలను లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. సాగు చట్టాల చుట్టూ ప్రతికూల వాతావరణాన్ని కొందరు సృష్టించిన విషయం రైతులు గుర్తెరగాలని అన్నారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు చర్యలు చేపడుతోందని అన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కాగా వివాదాస్పద వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ పంజాబ్, హర్యానా, యూపీకి చెందిన రైతులు గత ఏడాది నవంబర్ నుంచి ఢిల్లీ సరిహద్దుల్లో నిరసనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 20-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 16 | పేజీలు:4 | వెల: రూ.1/-

తెలంగాణ ఉద్యమంలో ఫొటో గ్రాఫర్స్ పాత్ర మరువలేనిది : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , ఆగష్టు 19: తెలంగాణ ఉద్యమంలో ఫోటో గ్రాఫర్స్ పాత్ర ఎంతో గొప్పదని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ అన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, కాంటెస్ట్‌ను రవీంద్రభారతిలో ప్రారంభించారు. ఫొటో గ్రాఫర్స్ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ లో ప్రదర్శించిన ఫొటోలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జర్నలిస్టులకు ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి కోవిడ్ సమయంలో వారి కుటుంబాలకు బాసటగా నిలిచారన్నారు. ఒక్క ఫొటో లక్ష మెదళ్లను కదిలిస్తుందన్నారు. ఫొటోగ్రాఫర్స్ కు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ ధర్మాన, కార్యదర్శి రజనీకాంత్ గౌడ్, కోశాధికారి శివకుమార్, సభ్యులు నగర గోపాల్, వెంకట్, సతీష్, శ్రీను, దీపక్ దేశ్ పాండే, అలీ, రాజేశ్వర్, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రేపు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ , ఆగష్టు 19:మొహర్రం సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు. పాతబస్తీలో బీబీకా ఆలం ఊరేగింపు నిర్వహించనున్నారు. డబీర్‌పురాలోని బీబీకా ఆలం నుంచి చాదర్‌ఘాట్ వరకు ఊరేగింపు కొనసాగనుంది. ఈ సమయంలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

ఫొటోగ్రాఫర్ల శ్రమ వెలకట్టలేనిది: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 19:ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వరదలు, కరువులు, ఉద్యమాలు, పోరాటాలను సమాజానికి తెలపాలన్న తపనతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఫొటోలు తీస్తుంటారన్నారని అన్నారు. అందమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, విషాద సన్నివేశాలు ఇలా వెలకట్టలేని దృశ్యాలను ఒక్క ఫొటో పదిలంగా ఉంచుతుందని చెప్పారు. వంద మాటలతో చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటోతో వర్ణించవచ్చని పేర్కొన్నారు. సన్నివేశాన్ని గుర్తుండిపోయేలా ఫొటోగ్రాఫర్లు తీసిన ఫొటోలు భావితరాలకు మధురమైన స్మృతులుగా మిగిలిపోతున్నాయని చెప్పారు.

పాక్‌లో మెహర్రం ఊరేగింపు సందర్భంగా పేలుడు.. ఇద్దరు మృతి



ఇస్లామాబాద్, ఆగష్టు 19:: పాకిస్థాన్‌లో మెహర్రం ఊరేగింపు సందర్భంగా బాంబు పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, 25 మంది గాయపడ్డారు. మృతుల్లో ఏడేండ్ల బాలిక, 20 ఏండ్ల వ్యక్తి ఉన్నట్లు పాక్ పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి సీరియస్‌గా ఉందన్నారు. లాహోర్‌కు సుమారు 260 కిలోమీటర్ల దూరంలోని బహవల్ నగర్‌లో గురువారం ఈ సంఘటన జరిగినట్లు చెప్పారు.షియాల మెహర్రం ఊరేగింపు ఇమాంబర్గాకు వెళుతున్నప్పుడు ఒక వ్యక్తి గ్రెనేడ్‌లు విరిసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. అనుమానితుడ్ని వెంటనే అరెస్ట్ చేసినట్లు తెలిపారు. భారీగా భద్రత ఏర్పాటు చేసినప్పటికీ ఈ ఘటన జరిగిందన్నారు. మరోవైపు పేలుడు అనంతరం ప్రజలు భయాందోళనతో పరుగులు తీస్తున్న దృశ్యాలు, గాయపడిన వారిని అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

దళిత ద్రోహి రేవంత్‌రెడ్డి: ప్రభుత్వ విప్ గువ్వల

హైదరాబాద్ , ఆగష్టు 19:టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్నాడని విమర్శించారు. దళితబంధుపై అక్కసుతోనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కేపీ వివేకానందతో కలిసి గువ్వల బాలరాజు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రేపో మాపో జైలుకు పోక తప్పదన్నారు.

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన దొంగ అని విమర్శించారు. రేవంత్‌ను నమ్ముకున్న వాళ్లు రాజకీయంగా భూస్థాపితం కాక తప్పదని అన్నారు. దళితులను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని వెల్లడించారు. దళిత ద్రోహి రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు ఆపకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని వెల్లడించారు. రాబోయే 20 ఏండ్లు తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వమే ఉంటుందని చెప్పారు. రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే గజ్వేల్ సభను ఆపితీరుతామని హెచ్చరించారు.

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబాబు డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశాన్ని దోచుకున్నది నెహ్రూ కుటుంబమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ ఫలితంగానే రేవంత్ రెడ్డికి పీసీపీ పదవి వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. ప్రైవేటు రంగంలో 6 లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ రంగంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామన్నారు. గురుకులాలు ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని, ప్రతీ విద్యార్థిపై రూ.లక్షా 25 వేలు ఖర్చు చేస్తున్నామని, సన్నబియ్యంతో అన్నం పెడుతున్నామని వెల్లడించారు. తెలంగాణ ఇచ్చింది తామేనని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీని రెండు రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఎందరో ఉద్యమకారులకు రాజకీయ భవిష్యత్ కల్పించిన నేత సీఎం కేసీఆర్ అని చెప్పారు.

ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే: ఎమ్మెల్యే ఆల

రేవంత్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎమ్మెల్యే ఆల వెంకట్ రెడ్డి సూచించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే విపక్షాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. సీఎం కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత విపక్షాలకు లేదన్నారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ లాంటి నాయకుడు కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఏ ముఖ్యమంత్రి చేపట్టని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సీఎం కేసీఆర్ చేస్తున్నారని చెప్పారు. దళితబంధు లాంటి పథకాలను గుడ్డిగా విమర్శించొద్దని సూచించారు.

నిరసనకారులపై తాలిబన్ల కాల్పులు.. పలువురు మృతి

కాబూల్, ఆగష్టు 19: : ఆఫ్ఘనిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీలో జాతీయ పతాకంతో నిరసన తెలుపుతున్న వారిపై తాలిబన్లు కాల్పులు జరిపారు. దీంతో పలువురు మృతి చెందారు. అసాదాబాద్ నగరంలో గురువారం ఈ ఘటన జరిగింది. బుధవారం జలాలాబాద్‌లోనూ జాతీయ జెండా విషయంలో నిరసన తెలపగా.. తాలిబన్ల కాల్పుల్లో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. తాలిబన్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు వారి జెండాలను చించేస్తూ.. ఆఫ్ఘన్ జెండాలను ప్రదర్శిస్తున్నారు.

గురువారం కూడా అసాదాబాద్‌లో తాలిబన్లకు వ్యతిరేకంగా జాతీయ జెండాలతో నిరసన తెలుపుతున్న సమయంలో తాలిబన్లు ఫైరింగ్ జరిపారు. అయితే అదే సమయంలో తొక్కిసలాట జరిగింది. దీంతో మరణాలు ఫైరింగ్ వల్ల జరిగాయా లేక తొక్కిసలాట వల్లనా అన్నది తెలియదని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. అసాదాబాద్‌లో వందల మంది రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపినట్లు ఆ వ్యక్తి చెప్పారు.

అనాథలను అక్కున చేర్చుకుంటాం: మంత్రి తలసాని

హైదరాబాద్ , ఆగష్టు 19:అనాథలను కూడా అక్కున చేర్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథలకు అండగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. గురువారం అంబర్ పేట నియోజకవర్గ పరిధిలోని నింబోలి అడ్డాలో గల అనాథ బాలికల ఆశ్రమాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అనాథ బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే వెంకటేశ్, ఇతర ఉన్నతాధికారులు బాలికలతో కలిసి భోజనం చేశారు. అనాథాశ్రమంలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

గాంధీ ఆస్పత్రిలో గ్యాంగ్‌రేప్ ఉట్టిదే.. సంతోష్‌నగర్‌లో కూడా..

హైదరాబాద్ , ఆగష్టు 19:రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కలకలం సృష్టించిన రెండు గ్యాంగ్‌రేప్ కేసులు కల్పితాలేనని సిటీ పోలీసులు తేల్చారు. సినిమా తరహాలో కట్టుకథలు అల్లిన ఓ ఇద్దరు యువతులు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. వారిపై ఎలాంటి అత్యాచారం జరగలేదని పోలీసుల విచారణలో తేలింది. ఒకరేమో ప్రియుడు పెళ్లి చేసుకోలేదని, మరొకరేమో కల్లుకు బానిస అయి.. తమపై అత్యాచారం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులను పోలీసులు సవాలుగా తీసుకొని విచారించారు. చివరకు ఈ యువతులపై అత్యాచారం జరగలేదని, అభూత కల్పన అని తేలింది.

అక్కాచెల్లెల్లు కల్లుకు బానిస అయి..

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం ఈ నెల మొదటి వారంలో గాంధీ ఆస్పత్రికి వచ్చాడు. రోగి వెంట ఆయన భార్య, మరదలు కూడా వచ్చారు. అయితే ఈ ఇద్దరు మహిళలకు కల్లు తాగే అలవాటు ఉంది. నగరంలో కల్లు దొరక్కపోవడంతో.. ఐదు రోజుల పాటు అలాగే ఉండిపోయారు. దీంతో వారి మానసికస్థితి సరిగా లేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. ఆగస్టు 11వ తేదీన అక్క తన భర్తను వదిలి వెళ్లిపోయింది. అక్క తనకు తెలియకుండా వెళ్లిపోవడంతో చెల్లి కూడా ఆగస్టు 11 నుంచి 15వ తేదీ వరకు గాంధీ ఆస్పత్రి ఆవరణలోనే తిరుగుతూ.. అక్కడున్న సెక్యూరిటీ గార్డుతో పరిచయం పెంచుకుంది. 12, 14 తేదీల్లో సెక్యూరిటీ గార్డుతో చెల్లి సన్నిహితంగా మెలిగింది. ఇక అక్క ఆచూకీ తెలియకపోవడంతో తనపై గ్యాంగ్‌రేప్ జరిగిందని చెల్లి ఓ కట్టుకథ అల్లింది.

వందల సీసీ కెమెరాలు.. గంటల కొద్ది వీడియోల పరిశీలన

ఈ కేసును పోలీసులు సవాలుగా తీసుకున్నారు. దీంతో గాంధీ ఆస్పత్రి ఆవరణతో పాటు ఆ పరిసరాల్లో ఉన్న వందలాది సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ వీడియోలను గంటల కొద్ది పరిశీలించారు. ఎక్కడ కూడా అత్యాచారం జరిగినట్లు ఆనవాళ్లు కనిపించలేదు.

అక్క కనిపించకుండా పోయేసరికి..

ఆస్పత్రి నుంచి అక్క కనిపించకుండా పోయేసరికి ఆమెకు ఏం చేయాలో తోచలేదు. తనను కుటుంబ సభ్యులు ఏమంటారోనని భయపడింది. ఇక అక్కడున్న వాచ్‌మెన్‌తో సన్నిహితంగా మెలిగిన ఆమె.. తనపై అత్యాచారం జరిగిందని, వరుసకు కుమారుడైన యువకుడికి చెప్పి మహబూబ్‌నగర్ బయల్దేరింది.అక్కడ ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు స్వీకరించలేదు. దీంతో ఆమె మళ్లీ హైదరాబాద్‌కు వచ్చి చిలకలగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తనను గ్యాంగ్ రేప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆమె.. అలాంటిదేమీ లేదని పోలీసుల విచారణలో స్పష్టమైంది. తాను భయపడి అత్యాచారం జరిగినట్లు కల్పిత కథ సృష్టించానని పోలీసుల విచారణలో ఆమె తెలిపింది.

సంతోష్‌నగర్ కేసు కూడా ఉట్టిదే..

సంతోష్‌నగర్‌కు చెందిన ఓ యువతి కూడా తనపై సామూహిక అత్యాచారం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ ఆమెపై అత్యాచారం జరగలేదని తేలింది. తాను ప్రేమించిన ప్రియుడు.. పెళ్లి చేసుకోనని చెప్పడంతో అతన్ని ఎలాగైనా పోలీసు కేసులో ఇరికించాలని ప్లాన్ చేసింది సదరు యువతి. దీంతో అత్యాచారం కథకు తెర లేపింది. ఓ రాత్రంతా చాంద్రాయణగుట్టలో తిరిగి.. ఆ రోజు రాత్రి తనపై అత్యాచారానికి పాల్పడినట్లు తల్లికి తెలిపింది యువతి. తన ప్రియుడే తనపై అత్యాచారం చేశాడని పోలీసులకు చెప్పడంతో.. వారు విచారించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రియుడిపై కోపంతోనే ఈ కట్టుకథ అల్లినట్లు ఆమె పోలీసుల ఎదుట ఒప్పుకుంది.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతూ ముందుకుసాగుతాం

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ జూన్ 19(నేటినిజం ప్రతినిధి): కమిషనరేట్ పరిధిలో అక్రమార్కులపై ఉక్కుపాదంమోపుతూ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ముందుకుసాగుతామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. ఎలాంటి అక్రమకార్యకలాపాలు జరిగినా సహించబోమని స్పష్టం చేశారు.

పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ గురువారంనాడు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. వివిధ రకాల రికార్డులు, ఫక్షనల్ వర్టికల్స్ పనితీరు, పోలీస్‌స్టేషన్ ఆవరణలను పరిశీలించడంతోపాటు అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు విధులు నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్లలోని వివిధ రికార్డుల్లో కేసుల వివరాలను ఏరోజుకారోజు నమోదు చేయడంతోపాటు సిసిటివన్‌ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ యూనిఫారం సర్వీస్ డెలివరీలో భాగంగా కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో అన్నివర్గాల ప్రజలకు ఫిర్యాదులు స్వీకరించడం, సత్వరంస్పందించి సేవలందించడం చర్యలను కొనసాగిస్తున్నామన్నారు. వివిధ విభాగాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించడంతోపాటు ఆయా విభాగాలకు చెందిన పోలీసులకు టెక్నాలజీ వినియోగంలో మరింత నైపుణ్యతను పెంపొందించేందుకు శిక్షణలను ఇస్తున్నామని చెప్పారు. పోలీస్‌స్టేషన్ల ఆవరణలో పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం 5ఎస్ కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా యువత తల్లిదండ్రులు, సంరక్షకుల పర్యవేక్షణలేక అర్ధరాత్రి వేళల్లో తిరుగుతుండటంతోపాటు, చెడు సహవాసాలతో వ్యసనాలకు బానిసలవుతున్నారనే విషయం దృష్టికి వచ్చిందని, ఈ వ్యవహారాన్ని నియంత్రించేందుకు స్పెషల్‌డ్రైవ్‌లను నిర్వహించి పట్టుకోవడంతోపాటు తల్లిదండ్రులు,సంరక్షకుల సమక్షంలో కౌన్సిలింగ్‌లను నిర్వహిస్తామని చెప్పారు. కొన్ని సందర్భాలలో పరిస్థితుల తీవ్రతనుబట్టి కేసులను నమోదు చేస్తామని చెప్పారు. కరోనా మూడవదశ సెగ తగలకుండా ఉండేందుకు అన్నివర్గాల ప్రజలు విధిగా మాస్క్‌లను ధరించడంతోపాటు, భౌతికదూరాన్ని పాటించడం, వైద్యుల సలహాలు,సూచనలు ఆచరించాలని సూచించారు. మాస్క్‌లను ధరించడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని కోరారు. మాస్క్‌లను ధరించని వారికి జరిమానాలు విధించే చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు. వివిధ రకాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులతోపాటు వీరికి ప్రత్యక్ష్యంగా,పరోక్షకంగా సహకరించే వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో ఒకటిరెండుసార్లు పోలీసులకు పట్టుబడి మళ్ళీ అదేతరహా నేరాలకు పాల్పడేవారిపై పిడియాక్ట్‌లను నమోదుచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ నటేష్, ఎస్ఐ శ్రీనివాస్‌లతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అమరావతి, ఆగష్టు 19:కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. గురువారం తాడేపల్లిలోని ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులను సీఎం జగన్, ఆయన సతీమణి భారతిరెడ్డి సన్మానించారు. అలాగే కిషన్‌రెడ్డి దంపతులకు వెంకటేశ్వర స్వామి ప్రతిమ అందజేసి నూతన వస్త్రాలు బహుకరించారు.

చరిత్రలో నేటినిజం

(ఆగష్టు 20 రాజీవ్‌గాంధీ జననం...) -రాధశ్రీ

సెల్: 9494481210

దోమ కాటు ఆరోగ్యానికి చేటు

(20 ఆగష్టు "ప్రపంచ దోమల నివారణ దినం" సందర్భంగా)

ఇండియాలో కరోనా రెండవ వేవ్ దాదాపు ముగిసిందని, నేడు మలేరియా, డెంగ్యూ లాంటి పలు సీజనల్ వ్యాధులు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి. 139 కోట్ల జనాభా కలిగిన భారతదేశాన్ని పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు అనేక ఏండ్లుగా వెంటాడుతున్నాయి. జనాభా పెరుగుదలతో పేదరికం అధికమవుతూ ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అవిద్య కారణంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడంతో పలు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వానాకాలంలో తొలకరి జల్లులతో పాటు దోమలు, ఈగలు లాంటి రోగకారక జీవులతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలుతాయని వైద్యాధికారులు వెల్లడిస్తారు. వానాకాలంలో మురికి నీటి నిల్వలతో దోమలు, లార్వాలు పెరిగి, దోమకాటుతో ప్రాణాంతక మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియాసిస్, యెల్లో ఫివర్, జీకా లాంటి వ్యాధులు సోకుతాయి. ఈగలతో సంక్రమించే వ్యాధుల్లో డిసెంట్రీ, డయేరియా, టైఫాయిడ్, కలరా, హెల్మెంథిస్ లాంటివి అంటుకుంటాయి. పూర్తిగా, సమర్థవంతంగా నివారించగల, వైద్యంతో సులభంగా నయం చేయగల మలేరియా రోగంతో ప్రతి ఏటా మిలియన్ల ప్రజలు బాధపడుతున్నారు . ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 219 మిలియన్ల మలేరియా కేసులు, కనీసం 4 లక్షల మలేరియా కారణ మరణాలు నమోదు అవుతున్నాయి. 20 ఆగష్టు 1897న నోబెల్ బహుమతి (1902) గ్రహీత 'సర్ రొనాల్డ్ రోస్' చేసిన ఆవిష్కరణ ప్రకారం ఆడ అనాఫిలిస్ దోమ కాటుతో మలేరియా వ్యాధి సంక్రమిస్తుందనే అతి ప్రధానమైన పరిశోధనా ఫలితాలను వివరించారు. మలేరియా వ్యాధి దోమకాటుతో సోకుతుందనే ప్రధాన ఆవిష్కరణను వివరించిన రోనాల్డ్ రోస్ ప్రకటన చేసిన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 20 ఆగష్టున 'ప్రపంచ నివారణ దినం (వరల్డ్ మలేరియా డే)' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ నివారణ దినం-2021 నినాదంగా 'రీచింగ్ ది జీరో మలేరియా టార్గెట్' అనే అంశాన్ని తీసుకున్నారు.

దోమకాటుతో సంక్రమించే మలేరియా వ్యాధి ఓ ప్రపంచ తీవ్ర ప్రాణాంతక సమస్యగా గుర్తించబడింది. ప్రపంచ మలేరియా కేసుల్లో సబ్-సహారా ఆఫ్రికా దేశాల్లో మలేరియా కారణ మరణాలు (ముఖ్యంగా పిల్లలు, మహిళలు) 90 శాతం వరకు నమోదు అవుతున్నాయి. దోమకాటుతో వ్యాప్తి చెందగల మలేరియా వ్యాప్తికి వర్షాలు, నిలువ నీరు, వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, అపరిశుభ్ర పరిసరాలు లాంటి కారణాలను చెప్పవచ్చు. మలేరియా సోకిన వ్యక్తిని కాటు వేసిన దోమలు తిరిగి ఆరోగ్యవంతులను కాటు వేయడంతో మలేరియా వ్యాధి ఆరోగ్యవంతులకు సంక్రమిస్తుంది. ఏకకణజీవి ప్లాస్మోడియం పరాన్నజీవి సోకిన వ్యక్తులకు మలేరియా రోగం వస్తుంది. మలేరియా సోకిన వ్యక్తులకు తలనొప్పి, చలిజ్వరం, కండరాల నొప్పి, శరీర నోప్పులు, సోమరితనం, నిస్సత్తువ లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. గర్భిణి స్త్రీలకు, గర్భంలోని శిశువు ఎదుగుదలకు మలేరియా అతి ప్రమాదకరమని తెలుసుకోవాలి. మలేరియా నిర్ధారణ పరీక్షగా రక్తంలో మలేరియా పరాన్నజీవి ఉనికిని తెలుసుకొనే 'మలేరియా రాపిడ్ డయగ్నాస్టిక్ టెస్ట్' నిర్వహిస్తారు. మలేరియా వ్యాధి నిర్ధారణ అయిన తరువాత నయం చేయడానికి సమర్థవంతమైన ఆంటీ-మలేరియా ఔషధాలు ఇవ్వబడతాయి. విచక్షణ మరిచి మలేరియా ఔషధాలను వాడితే దుష్ప్రభావాలు అతి తీవ్రంగా ఉంటుంది. 2018లో మలేరియాకు ఆర్‌టీయస్,యస్ టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ టీకాలను మలేరియా అధికంగా వ్యాపిస్తున్న ప్రాంతాల్లో శిశువులకు, పిల్లలకు అందిస్తారు.

ఐదురకాల మలేరియా పరాన్నజీవుల్లో ప్లాస్మోడియం ఫాల్సిఫరమ్ పరాన్నజీవితో సంక్రమించే మలేరియా అత్యంత ప్రమాదకరమైనది. రోగి నుండి మరో ఆరోగ్యవంతుడికి నేరుగా మలేరియా సోకదు, కాని దోమకాటుతో మాత్రమే రోగం సోకుతుంది. సకాలంలో చికిత్స అందని యెడల వ్యాధి తీవ్రమై రక్తహీనత, జాండిస్, మెంటల్ కన్ఫ్యూజన్, కిడ్నీ ఫెయిల్యూర్, కోమాతో పాటు చివరకు మరణం కూడా కలగవచ్చు. రక్తంలో చేరిన పరాన్నజీవి కాలేయం, ఎర్ర రక్తకణాలను ప్రభావితం చేస్తుంది. మలేరియా సోకిన వ్యక్తికి సరైన వైద్యం సకాలంలో అందనియెడల ప్రాణం పోవడం ఖాయమని తెలుసుకోవాలి. మలేరియా పరాన్నజీవి శరీరంలోకి ప్రవేశించిన 7-18 రోజుల్లో రోగలక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో చికిత్స లభించని కేసుల్లో దీర్ఘకాలిక రోగాలు కలుగవచ్చని కూడా గమనించారు. మలేరియా కారణ దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత, మురుగు నీరు నిలువ లేకుండా చూడడం, శరీర అవయవాలను పూర్తిగా కప్పుకునేలా దుస్తువులు ధరించడం, దోమ తెరలు వాడడం, దోమలను తరిమే ఆధునిక/సహజ మస్కిటో రిపెలెంట్స్ వాడడం, రోగ లక్షణాలను గమనించడం, సత్వరమే చికిత్స చేయించుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం లాంటి చర్యలు చేపట్టాలి. పలు వ్యాధుల నివారణకు కారణాలుగా సురక్షిత నీరు వాడడం, పరిసరాల/వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అంటువ్యాధులతో జాగ్రత్తగా ఉండడం లాంటి చర్యలు తీసుకోవాలి. దోమలు, లార్వాలను నివారించడం, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త పడడం, సకాలంలో చికిత్స తీసుకోవడం లాంటి చర్యలతో మలేరియా వ్యాధిగ్రస్తులో కనిపించని (జీరో మలేరియా) ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ప్రపంచ కుబేరుల జాబితాలో డీమార్ట్ అధినేత

హైదరాబాద్ , ఆగష్టు 19:ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కుబేరుల జాబితాలో భారత్‌కు చెందిన డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ చేరిపోయారు. ప్రపంచంలోని టాప్ 100 మంది కుబేరుల జాబితాలో ఆయన చోటు దక్కించుకున్నారు. బ్లూమ్ బర్గ్ ప్రకటించిన బిలియనీర్స్ జాబితాలో దమానీకి 98వ స్థానం లభించింది. దమానీ నికర సంపద రూ.1.38 లక్షల కోట్లుగా బ్లూమ్ బర్గ్ అంచనా వేసింది.

మన దేశంలో రీటెయిల్ సరుకుల చెయిన్ మాల్స్ ను డీమార్ట్ నిర్వహిస్తోంది. ఇతర మాల్స్ కంటే తక్కువ ధరకు సరుకులను అందిస్తూ వినియోగదారులకు డీమార్ట్ దగ్గరైంది. ముఖ్యంగా కరోనా సమయంలో ఈ సంస్థ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. కరోనా సమయంలో అత్యధిక లాభాలు సంపాదించిన సంస్థల్లో డీమార్ట్ ముందు వరుసలో ఉంది. కోవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, నిత్యావసర సరుకులను, వస్తువులను వినియోగదారులకు అందించడం ద్వారా? డీమార్ట్ తన వ్యాపారాన్ని అనేక రెట్లు పెంచుకుంది. మరోవైపు ప్రపంచ అగ్రశ్రేణి కుబేరుల జాబితా టాప్-10లో భారత్ నుంచి ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, అజీమ్ ప్రేమ్ జీ, పల్లోంజీ మిస్త్రీ, శివ నాడార్, లక్ష్మీ మిట్టల్ ఉన్నారు.

ఏపీ సీఎం జగన్‌కు షాక్..
సమన్లు జారీ చేసిన సీబీఐ కోర్టు

అమరావతి, ఆగష్టు 19:ఏపీ సీఎం జగన్‌కు హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టు సమన్లు జారీ చేసింది. వాన్‌పిక్ ప్రాజెక్టు వ్యవహారంలో మనీలాండరింగ్ అంశంపై ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.. సెప్టెంబర్ 22న విచారణకు హాజరుకావాలని జగన్‌ను ఆదేశించింది. జగన్‌తో పాటు రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే మోపిదేవి వెంకటరమణ, ఐఆర్‌టీఎస్ అధికారి కేవీ బ్రహ్మానందరెడ్డి, పారిశ్రామికవేత్తలు నిమ్మగడ్డ ప్రసాద్, నిమ్మగడ్డ ప్రకాష్, ఐఏఎస్ అధికారులు శామ్యూల్, మన్మోహన్ సింగ్, జగతి పబ్లికేషన్స్ సహా 12 కంపెనీలకు సీబీఐ కోర్టు సమన్లు పంపింది.

వాన్‌పిక్ వ్యవహారంలో చేతులు మారిన సొమ్ముపై మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం ఈడీ విచారణ జరిపింది. వివిధ కంపెనీల ద్వారా సొమ్ము చలామణి అయినట్లు ఈడీ గుర్తించింది. కాగా ఈ కేసులో జగన్, నిమ్మగడ్డ ప్రసాద్ సంస్థలకు చెందిన సుమారు రూ.863 కోట్ల ఆస్తులను 2016లోనే ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. జగన్ కంపెనీలకు చెందిన సుమారు రూ.538 కోట్ల విలువైన ఆస్తులతో పాటు వాన్ పిక్ భూములు సహా నిమ్మగడ్డ కంపెనీలకు చెందిన రూ.325 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే

ఆఫ్ఘనిస్థాన్ ప్రజలతో చారిత్రక మైత్రి కొనసాగుతుంది: విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్

అమరావతి, ఆగష్టు 19:ఆఫ్ఘనిస్థాన్ ప్రజలతో చారిత్రక మైత్రి కొనసాగుతుంది: విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్లు ఆక్రమించిన తరువాత భారత్ తొలి సారి స్పందించింది. ఆఫ్ఘన్ లో తాలిబన్ల రాజ్యం ఇంకా ప్రారంభదశలోనే ఉందన్నారు. విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్. ప్రస్తుతానికి కాబూల్ లో జరుగుతున్న పరిణామాలపై సమీక్షిస్తున్నామన్నారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రజలతో తమ చారిత్రక మైత్రి ఎప్పటికీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదే మున్ముందు ఆఫ్ఘనిస్థాన్ తో సంబంధాలను నిర్ణయిస్తుందన్నారు. ప్రస్తుతానికి అక్కడ చిక్కుకున్న భారత పౌరుల భద్రత, వారిని సురక్షితంగా దేశానికి తీసుకురావడంపైనే దృష్టి పెట్టామన్నారు. అక్కడి హిందువుల, సిక్కులను క్షేమంగా దేశానికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అన్ని దేశాల్లాగే తామూ ఆఫ్ఘనిస్థాన్ లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ లో పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశాల కోసం అమెరికాకు వెళ్లిన ఆయన.. తాలిబన్లతో భారత్ టచ్ లో ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

దళితబంధు పథకాన్ని కేసీఆర్ కోర్టుకు వెళ్లి ఆపుతారు: ఈటెల

హైదరాబాద్ , ఆగష్టు 19:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దళిత బంధు పథకంపై బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటెల సంచలన ఆరోపణలు చేశారు. దళిత బంధు పథకాన్ని ప్రతిపక్షాలు ఆపుతాయని టీఆర్ఎస్ నేతలు చెప్పడం సరికాదని.. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆరే కోర్టుకు వెళ్లి ఆపి వేయించేస్తారని ఈటెల ఆరోపించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిన్న దళిత సంఘాల ఆధ్వర్వంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు.

హుజూరాబాద్ ఉప ఎన్నికలో తన బొండిగ పిసికేందుకే కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారన్ని ఈటెల ఎద్దేవా చేశారు. నాలుగేళ్లలో దళితబంధు పథకాన్ని రాష్ట్రం మొత్తం అమలు చేస్తామని కేసీఆర్ చెబుతున్నారని, కానీ 40 ఏళ్లైనా అమలు సాధ్యం కాదన్నారు. దళితులను కేసీఆర్ మొదటి నుంచి దగా చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. పథకం అమలుకు రూ. 2.5 లక్షల కోట్లు అవసరమని, బడ్జెట్ లేకుండా పథకం అమలు ఎలా సాధ్యమని ఈటెల ప్రశ్నించారు.

ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్న వారి ప్రాణాలను రక్షిస్తున్న లేక్‌పోలీసులు

కరీంనగర్ జూన్ 19(నేటినిజం ప్రతినిధి): వివిధ రకాల కలహాలు, ప్రేమవ్యవహారంలో వైఫల్యం, మద్యం,మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం, ఆర్థిక ఇబ్బందులు ఇలా ఎన్నోరకాల కారణాలతో జీవితాలపై విరక్తిచెంది ఇక ఆత్మహత్యశరణ్యంగా భావిస్తూ ఎంతోమంది దిగువ మానేరు జలాశయం(ఎల్‌యండి)లో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్న వారిని లేక్‌అవుట్‌పోస్ట్ పోలీసులు రక్షిస్తున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో ఆత్మహత్యలకు పాల్పడటం సరైందికాదని, ఒక్కనిమిషం ఆలోచించి భవిష్యత్ గురించి ఆలోచించినట్లయితే సజావుగా జీవితాన్ని కొనసాగించవచ్చంటూ కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్‌లను నిర్వహిస్తూ విలువైన ప్రాణాలను రక్షించడంతోపాటు ఆత్మహత్యలకు యత్నించిన వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. లేక్‌పోలీసుల సాహసోపేతమైన చర్యలకు అన్నివర్గాల ప్రజలు ప్రశంసలజల్లు కురిపిస్తున్నారు.

నియంత్రణలో అక్రమ, అసాంఘీక కార్యకలాపాలు

దిగువ మానేరు జలాశయం(ఎల్‌యండి), ఉజ్వలపార్క్, జింకలపార్క్‌ల ప్రాంతాల్లో గతంలో నిత్యం అసాంఘీక, అక్రమ కార్యకలాపాలు జరిగేవి. దీంతో ప్రజలు ఆ ప్రాంతాలకు వెళ్ళేందుకు భయాందోళన చెందేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత పైన పేర్కొన్న ప్రాంతాలే సందర్శక ప్రాంతాలుగా మిగిలాయి. ఆ ప్రాంతంలో అసాంఘీక, అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించేందుకు ప్రస్తుత ప్రణాళికసంఘం ఉపాధ్యక్షులు బి వినోద్‌కుమార్ మంజూరు చేసిన నిధులతో 2017 అక్టోబర్ 10న లేక్‌పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీంతో వివిధ రకాలుగా నిఘా తీవ్రం కావడం, రేయింబవళ్ళు పెట్రోలింగ్‌లు కొనసాగుతుండటంతో బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించడం, పోకిరీల ఆకతాయి చర్యలు పూర్తిగా నియంత్రణలోకి వచ్చాయి. తత్ఫలితంగా అన్నివర్గాల ప్రజలకు భద్రతపై భరోసా ఏర్పడి ప్రజలు ఆయా సందర్శక ప్రాంతాలకు వస్తున్నారు.

179మంది ప్రాణాలను రక్షించిన పోలీసులు

డ్యామ్‌లో ఆత్మహత్యలకు పాల్పడేందుకు వచ్చిన వారిని రేయింబవళ్ళు గస్తీలో ఉంటున్న లేక్‌అవుట్‌పోస్ట్ పోలీసులు గుర్తిస్తూ, వారిని నిలువరించి ప్రాణాలను రక్షిస్తున్నారు. డ్యామ్‌తోపాటు జింకల, ఉజ్వల ప్రాంతాల్లోని కదలికలను గుర్తించేందుకు ప్రజల సహకారంతో ఇప్పటి వరకు 25పైగా సిసి కెమెరాలు ఏర్పాటయ్యాయి. విధుల్లో ఉన్న పోలీసులు గస్తీ నిర్వాహణ సందర్భంగా తమకు తటస్థపడిన వారిని వివరాలు అడిగి తెలుసుకోవడంతోపాటు సిసి కెమెరాల ద్వారా కదలికలను గుర్తిస్తున్నారు. లేక్‌పోలీసులు ఇప్పటి వరకు 179మంది ప్రాణాలను రక్షించారు.రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అన్నిస్థాయిలకు చెందిన పోలీసులకు ఉన్నతాధికారులు రివార్డులను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

లేక్‌అవుట్‌పోస్ట్ ప్రాంతంలో భద్రత మరింత పటిష్టం చేస్తాం-పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

ఆత్మహత్యలకు పాల్పడటం మహాపాపమని, ప్రతి సమస్యకు పరిష్కారమార్గం ఉందని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా తమపై ఆధారపడిన కుటుంబసభ్యులు అనాధలుగా మారుతారని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. డ్యామ్ వద్ద ఆత్మహత్యాయత్నాలను నిలువరిస్తూ, విలువైన ప్రాణాలను రక్షిస్తున్న లేక్ అవుట్ పోస్ట్ పోలీసులను అభినందించారు. లేక్‌పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద నిఘాను మరింత పటిష్టం చేయడంతోపాటు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నామని చెప్పారు.

పార్క్ చేసిన కారులో డెడ్‌బాడీ కలకలం

అమరావతి, ఆగష్టు 19:విజయవాడ నగరంలో రోడ్డుపక్కన ఆగి ఉన్న కారులో డెడ్‌బాడీ కలకలం రేపింది. మాచవరం పార్క్ చేసిన కారులో మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడిని తాడిగడపకు చెందిన రాహుల్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు జి.కొండూరులోని జిక్సిన్ సిలిండర్స్ కంపెనీకి యజమాని అని పోలీసులు వెల్లడించారు.

వ్యాపార పనుల నిమిత్తం అరగంట లేదా గంట సమయంలో తిరిగి వస్తానని చెప్పి ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం పోలీసులకు మాచవరం సమీపంలో కారులో డెడ్ బాడీ కన్పించింది. కాగా రాహుల్ ఆత్మహత్య చేసుకున్నాడా, ఎవరైనా ఆయనను హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కొత్త కారు కావడంతో బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయలుదేరిన రాహుల్ ఎక్కడెక్కడికి వెళ్లారనే విషయమై కూడా పోలీసులు టెక్నికల్ ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు.కారు అద్దాలు పగులగొట్టడం కంటే కారు షోరూం నుంచి నిపుణులను తీసుకొచ్చి కారు డోర్స్ ఓపెన్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే గోరంట్లకు చంద్రబాబు ఫోన్!

అమరావతి, ఆగష్టు 19:టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. ఆ పార్టీకి రాజీనామా చేస్తారని వస్తున్న ప్రచారం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి పార్టీ అధినేత చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. అసంతృప్తికి గల కారణాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. స్థానికంగా ఇబ్బందులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు సైతం బుచ్చయ్య చౌదరికి ఫోన్ చేసి మాట్లాడారు.

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి పార్టీకి రాజీనామా చేస్తారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టీడీపీకి రాజీనామా విషయంపై స్పందించేందుకు ఎమ్మెల్యే గోరంట్ల నిరాకరించారు. ఈ విషయంపై ఇప్పుడేమీ మాట్లాడబోనని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ సీనియర్ నేతలు, ఆయన అనుచరులు గోరంట్లతో ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు.

అనుబంధ కమిటీల నియామకం, జిల్లాలో స్థానిక నేతల తీరుపై కొంత కాలంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి అసంతృప్తితో ఉన్నారు. అనుబంధ కమిటీల్లో నియామకానికి సంబంధించి ఇటీవల గోరంట్ల సిఫారసు చేసిన పేర్లకు అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వలేదనే చర్చ ఆయన్ను మరింత కలత చెందేలా చేసిందని సమాచారం. కాగా, టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు బుచ్చయ్య చౌదరి. ఇప్పటి వరకు 6 సార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

డెంగీ డెంజర్ బెల్స్..

హైదరాబాద్ , ఆగష్టు 19:తెలంగాణ విషజ్వరాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి జ్వరాలతో ఆస్పత్రి వస్తున్న వారి సంఖ్య విపరీతంగా పెగిపోయింది. గత పది రోజుల నుంచి వాతవారణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ప్రజలు వైరల్ ఫీవర్ భారీన పడుతున్నారు. దోమల బెడద కూడా తోడవడటంతో డెంగీ కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది.

సాధారణ రోజుల్లో వచ్చే రోగలకంటే రెండు మూడు రెట్లు అధికంగా రోగులు ఆస్పత్రులకు వస్తున్నారు.. ప్రభుత్వ దవాఖానాలే కాదు.. ప్రయివేట్ దవాఖానాల పరిస్థితి కూడా అలాగే ఉంది.. హస్పిటల్ ఏదైనా సరే రోగుల మాత్రం పెరిగి పోతున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి ఓపీ ట్రీట్ మెంట్ కొందరికి, తీవ్రతను బట్టి హస్పిటల్ లో మరికొందరిని చేర్చుకుని ట్రీట్ చేస్తున్నారు? అయితే ప్రయివేట్ ఆస్పత్రిలో మాత్రం డెంగీ లక్షణాలు కనిపిస్తే చాలూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జనం.

హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాల్లో అధికంగా డెంగ్యూ కేసులు నమోదవతున్నాయి. హైదరాబాద్‌లో 447, ఖమ్మం లో 134 కేసులు, రంగారెడ్డి లో 110 కేసులు మొత్తానికి ఈ ఏడాది ఇప్పటికే 12 వందల కేసులు నమోదయ్యాయి. రెండేళ్ళ క్రితం ఈ సారి సైతం డెంగీ డేంజరస్ గా విజృంభిస్తోంది..

హైదరాబాద్‌లో ఫీవర్ ఆస్పత్రి, నిలోఫర్, గాంధీ, ఉస్మానియాల్లోని ఓపీలు రోగుల క్యూ లైన్లతో నిండిపోతున్నాయి.

అధికారులు ఇప్పటికైన మేల్కొని తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆస్పత్రుల్లో సరైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఏపీలో ప్రభుత్వ బడుల సమయం పెంపు..

హైదరాబాద్ , ఆగష్టు 19:ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ పాఠశాలల సమయాన్ని పొడిగించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పని చేసేలా పాఠ్య ప్రణాళికను రూపొందించారు. ప్రారంభానికి ముందు గంటా 45 నిమిషాలు, తరగతులు ముగిసిన తర్వాత గంటా 15 నిమిషాలను పెంచి.. ఉన్నత పాఠశాలల మొత్తం సమయాన్ని 10 గంటలు చేశారు. గతంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 9.45 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పని చేసేవి. గతేడాది కరోనా నేపథ్యంలో ఈ సమయాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు మార్చారు. ఇప్పుడు సహ పాఠ్య కార్యక్రమాల కోసం సమయం పెంచుతూ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో 188 రోజులు బడులు పని చేయనున్నాయి. ఏప్రిల్ 30 వరకు తరగతులు నిర్వహించనున్నారు. అనంతరం వేసవి సెలవులు ఇస్తారు.

నవ్మెటివ్-1 పరీక్ష 6-10 తరగతులకు డిసెంబరు 27 నుంచి జనవరి 7 వరకు, సమ్మెటివ్-2 పరీక్ష 6-9 తరగతులకు ఏప్రిల్ 18 నుంచి 29 వరకు నిర్వహిస్తారు. సెప్టెంబరు, నవంబరు, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఫార్మెటివ్ పరీక్షలు ఉంటాయి. ఈ ఏడాది విద్యార్థులు నీళ్లు తాగేందుకు 'నీటి గంట' అమలు చేస్తున్నారు. ఇందుకు 5 నిమిషాలు విరామం ఇస్తారు. ప్రతి నెలా మొదటి, మూడో శనివారం 'నో బ్యాగ్ డే'ను నిర్వహిస్తారు. బోధన ప్రణాళికలు, తరగతిలో గమనించిన అంశాలు రాసుకునేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక డైరీ ఉంటుంది. విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంచేందుకు ప్రతి రోజు ఒక పీరియడ్ 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి కేటాయిస్తారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతి శుక్రవారం 8వ పీరియడ్‌లో 'కెరీర్ గైడెన్స్'పై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులను ఆహ్వానిస్తారు. వారంలో ఒక రోజు పాఠశాల ఆరోగ్య కార్యక్రమం, ప్రముఖ దినోత్సవాలు, సామూహిక పఠనంలాంటివి నిర్వహించాల్సి ఉంటుంది.

కాగా, ఈ నెల 16 నుంచి రాష్ట్రంలోని స్కూళ్లను ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తరగతి గదికి 20 మంది విద్యార్థులు మించకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే.. విద్యార్థులు కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టారు. స్టూడెంట్స్ మాస్క్ ధరించేలా, భౌతికదూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

నేటి నుంచి నర్సరీ మేళా.. ప్రారంభించనున్న మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ , ఆగష్టు 19:నగరంలో గ్రాండ్ నర్సరీ మేళా జరగనుంది. పీపుల్స్ ప్లాజాలో నేటి నుంచి ఐదు రోజులపాటు జరగనున్న ఈ జాతీయ ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనను మంత్రులు హరీశ్ రావు, నిరంజన్ రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణ ఈవెంట్ ఆర్గనైజర్ (టీఈఓ) ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 23 వరకు ఈ జాతీయ ప్రదర్శన జరుగుతున్నది. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమబెంగాల్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి దేశంలోని ప్రముఖ సంస్థలు, నర్సరీలు 125 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా వివిధ రకాల పూలు, పండ్లు, టెర్రస్ గార్డెనింగ్ మొక్కలను ప్రదర్శించనున్నారు.

అస్ట్రాజెనికాతో పోల్చితే ఫైజర్ టీకా త్వరగా శక్తిహీనమవుతోంది..

ఆగష్టు 19:లండన్: కోవిడ్ టీకాల్లో ఏది ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుందో ఇప్పుడు చెప్పడం కష్టం. కానీ తాజాగా నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. ఆస్ట్రాజెనికా (ంబబీతీజీలివనివఇజీ) టీకా కన్నా ఫైజర్ టీకా త్వరగా శక్తిహీనమవుతుందని తేల్చారు. దానికి సంబంధించిన అధ్యయన నివేదికను గురువారం పబ్లిష్ చేశారు. రెండో డోసుల ఫైజర్ టీకా.. కోవిడ్ ఇన్‌ఫెక్షన్లపై సమర్ధవంతంగా పనిచేస్తుందని, కానీ ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనికా టీకాతో పోల్చితే, ఫైజర్ ప్రభావం త్వరగా నశిస్తున్నట్లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. బ్రిటన్‌కు చెందిన నేషనల్ స్టాటిస్టిక్స్ ఈ

యాదాద్రిలో ముగిసిన పవిత్రోత్సవాలు

యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగష్టు 19:: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ నెల 17న ప్రారంభమైన పవిత్రోత్సవాలు మూడు రోజుల పాటు వైభవోపేతంగా జరిగాయి. చివరి రోజైన గురువారం పవిత్రముల ధారణ, మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలను అర్చకులు శాస్త్రోక్తంగా ముగించారు.

తెలిసీ తెలియక ఏడాది నుంచి చేసిన తప్పొప్పులు తొలగిపోవడానికి ప్రతి ఏటా ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, పురోహితుల మంత్రోచ్చారణల మధ్య వేదపండితుల వేదపారాయణాల నడుమ మహాపూర్ణాహుతితో అర్చకులు పవిత్రోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

తమిళిసై మాతృమూర్తి మృతిపై సంతాపం వ్యక్తం చేసిన చిరంజీవి

హైదరాబాద్ , ఆగష్టు 19:తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ తల్లి కృష్ణ కుమారి (80) అనారోగ్యంతో బుధవారం ఉదయం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె మృతితో తమిళిసై సౌందర్ రాజన్ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం ఆమె పార్థివ దేహాన్ని ప్రముఖుల సందర్శనార్థం రాజ్ భవన్‌లో ఉంచగా, సాయంత్రం తమిళనాడు తీసుకువెళ్లారు. చెన్నైలోని సాలిగ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కృష్ణ కుమారి మృతిపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గవర్నర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఫోన్‌లో తమిళిసైని పరామర్శించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తమిళనాడు, పుదుచ్చేరి సీఎంలు స్టాలిన్, రంగస్వామి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గవర్నర్‌ను ఫోన్‌లో పరామర్శించారు.

తాజాగా మెగాస్టార్ చిరంజీవి తన ట్విట్టర్ ద్వారా తమిళి సైకి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మీ తల్లి మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాను. మీ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అంటూ చిరంజీవి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఎస్ఐ భాగ్యలక్ష్మి కుటుంబానికి

03లక్షల ప్రమాదభీమా అందజేత

కరీంనగర్ జూన్ 19(నేటినిజం ప్రతినిధి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెద్దపల్లిజిల్లా కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ భాగ్యలక్ష్మికి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటి ద్వారా చేయించబడిన వ్యక్తిగత ప్రమాదభీమా ద్వారా మంజూరు అయిన 03లక్షల రూపాయలను గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఆమెభర్త రాజశేఖర్, కూతురు ఐశ్వర్యలకు అందజేశారు. గత జూన్ 17న పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో ఏఎస్ఐ భాగ్యలక్ష్మి మృతిచెందిన విషయం విదితమే.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు యం సురేందర్, సభ్యులు మధు తదితరులు పాల్గొన్నారు.

సిపిని కలిసిన అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణను గురువారంనాడు జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమ అగ్రవాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ రకాల పరిస్థితులపై చర్చించారు.

పాతబస్తీలో బీబీకా ఆలంను సందర్శించిన షర్మిల..

హైదరాబాద్ , ఆగష్టు 19:వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల హైదరాబాద్ పాతబస్తీలో ఈరోజు పర్యటించారు. రేపు మొహర్రం సందర్భంగా పాతబస్తీ డబీర్ పూర్ లో ఉన్న బీబీకా ఆలంను ఆమె సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ విషయాన్ని ఆమె ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ముస్లిం సోదరులు, సోదరీమణులతో కలిసి చాదర్ సమర్పించడం జరిగిందని ఆమె ట్వీట్ చేశారు. ఇమామ్ హజరత్ హుస్సేన్ ప్రజల హక్కుల కోసం పోరాడారని? అదే విధంగా తెలంగాణలో హక్కుల కోసం తాము పోరాడతామని చెప్పారు.

కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ దవాఖానాల్లో పెరుగుతున్న ప్రసవాలు : మంత్రి గంగుల

కరీంనగర్ జూన్ 19(నేటినిజం ప్రతినిధి): కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ దవాఖానాల్లో గణనీయంగా ప్రసవాలు పెరుగుతున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ లోని ప్రభుత్వ దవాఖానలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సిటీస్కాన్ సెంటర్ తోపాటు వార్డును మంత్రి ప్రరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కేసీఆర్ కిట్ల పంపిణీతో నిరుపేదలకు ఏంతో ప్రయోజనం చేకూరుతోందన్నారు.

ప్రసవాల కోసం ప్రతి నిరుపేద ప్రభుత్వ దవాఖానలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్లతో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగిందని, వీటి సంఖ్య ఇంకా పెంచాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. కలెక్టర్ ఆర్వీ కర్ణన్, మేయర్ వై సునీల్ మందులు సిద్ధం చేయాలని అధికారులను కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు విజయ, రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్వల సిల్వర్ జూబ్లీ వేడుకలు.. పాల్గొన్న సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ , ఆగష్టు 19: ప్రజ్వల ఆర్గనైజేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం ఉప్పల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా 1కే రన్ నిర్వహించగా.. రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ మానవ అక్రమ రవాణాను నిర్మూలనకు ప్రతిష్టాత్మకమైన సంస్థ అన్నారు. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో బంధించబడిన వేలాది మంది ప్రజ్వల సహాయంతో రక్షించబడ్డారన్నారు. రెస్క్యూ ఆపరేషన్ల తర్వాత బాధితులందరికీ ప్రజ్వల కేంద్రాల్లో పునరావసం కల్పించడంతో పాటు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం, పథకాల ద్వారా ఇండ్లు సైతం అందిస్తుందన్నారు. ఫౌండేషన్ పలువురు బాధితులకు వివాహం చేసుకొని సమాజంతో కలిసి బ్రతికేందుకు సహాయపడిందన్నారు.

మొదటల్లో ఫలక్‌నుమాలోని ఓ చిన్న భవనంలో ప్రజ్వల సంస్థ ప్రారంభమై.. నేడు పెద్ద వృక్షంగా మారిందని, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సేవలందిస్తుందని సీపీ గుర్తు చేశారు. ఫౌండేషన్ రాబోయే 25 సంవత్సరాల్లో మానవ అక్రమ రవాణా లేని సమాజం కోరుకుంటుందన్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు బాధితులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా రాచకొండ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, ఎస్ఓటీ, లా అండ్ ఆర్డర్ బృందాలు మానవ అక్రమ రవాణాపై సమష్టిగా పోరాడాయన్నారు. భారత్‌తో పాటు ఉగాండా, టాంజానియా, నేపాల్, బంగ్లాదేశ్‌తో పాటు పొరుగు దేశాల నుంచి అనేక మంది బాధితులను రక్షించినట్లు చెప్పారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఐదేళ్లలో దాదాపు 700 మంది బాధితులను రక్షించామన్నారు. ప్రజ్వల సహాయంతో బాధితులందరికీ పునరావాసం కల్పించినట్లు సీపీ తెలిపారు. సునీత కృష్ణన్ మాట్లాడుతూ సమాజాన్ని మానవ అక్రమ రవాణా నుంచి విముక్తి చేసే లక్ష్యంగా ప్రజ్వల పని చేస్తుందన్నారు. మానవ అక్రమ రవాణాలో పాల్గొనడం, ప్రోత్సహించడం దారుణమైన నేరమని, నాగరిక సమాజానికి సిగ్గుచేటని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఓ ప్రధాన సమస్య అని, దాన్ని అంతం చేసేందుకు అనేక సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, రాజేశ్, మల్కాజ్‌గిరి, ఉప్పల్ ఏసీపీలు శ్యామ్ ప్రసాద్ రావు, ఎన్ రంగస్వామి, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ప్రజ్వలా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీలో గోరంట్ల సంక్షోభం.. నేతల పరుగో పరుగు..

అమరావతి, ఆగష్టు 19:ఏపీ టీడీపీలో గోరంట్ల టెన్షన్ నెలకొంది. సీనియర్ నేత అయిన గోరంట్ల టీడీపీకి గుడ్ బై చెబుతున్నారని ప్రచారంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారి వేడెక్కాయి. సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి పార్టీని వీడుతున్నారంటూ వార్తలు రావడంతో టీడీపీ అధిష్ఠానం అప్రమత్తమైంది. ఆయనను బుజ్జగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

టీడీపీకి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజీనామా చేయబోతున్నారనే వార్తలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఖండించారు. పార్టీకి గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజీనామా చేయడం లేదని స్పష్ట చేశారు. రాజమండ్రి డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు కూడా గోరంట్ల రాజీనామా చేయడం లేదని తెలిపారు.

మరోవైపు గోరంట్ల రాజీనామా చేయబోతున్నారనే వార్త తెలియగానే పలువురు నేతలు, కార్యకర్తలు ఆయన ఇంటికి క్యూ కడుతున్నారు.

ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఫోన్ లో గోరంట్లతో మాట్లాడారు. మాజీ మంత్రులు చినరాజప్ప, జవహర్ రాజమండ్రిలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసానికి వెళ్లారు. ఆయనతో వారిరువురు చర్చలు జరిపారు.

గోరంట్ల బుచ్చయ్య చౌదరి పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వ్యక్తి అని మాజీ మంత్రి చినరాజప్ప అన్నారు. గోరంట్ల ప్రస్తావించిన అంశాలను చంద్రబాబుకు నివేదిస్తామని తెలిపారు. రాజమండ్రి టీడీపీలో తనకు కొన్ని సమస్యలు ఉన్నట్టు గోరంట్ల చెప్పారని తెలిపారు. తనను కొందరు గౌరవించడంలేదని చెప్పారని చినరాజప్ప వెల్లడించారు. రాజీనామా చేస్తానని గోరంట్ల ఎప్పుడూ చెప్పలేదని తెలిపారు. సీనియర్ నేతగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా గోరంట్లకు పార్టీలో ఎప్పుడూ గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు.

అంతకు ముందు.. అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా గోరంట్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోరంట్లతో అన్ని విషయాలను మాట్లాడామని, ఆయన రాజీనామా చేయబోరని చెప్పారు. ఏ సమస్యలున్నా పార్టీలో అంతర్గతంగా పరిష్కరించుకుంటామని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకుడు గోరంట్ల అని కొనియాడారు.

అదే జరిగితే కూలీలుగా మారనున్న రైతన్నలు : ఆర్.నారాయణమూర్తి



సూర్యాపేట, ఆగష్టు 19: : నూతన వ్యవసాయ చట్టాలతో దేశంలోని రైతాంగాన్ని కూలీలుగా మార్చేందుకు కేంద్రం కుట్రలు పన్నిందని ఇదే విషయాన్ని ఇతివృత్తంగా తీసుకుని రైతన్న సినిమా తీసినట్లు నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి తెలిపారు. సూర్యాపేట క్యాంప్ కార్యాలయంలో మంత్రి జగదీష్ రెడ్డితో ఆర్.నారాయణ మూర్తి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రైతన్న సినిమాను వీక్షించిన మంత్రికి ఆర్.నారాయణ మూర్తి అభినందనలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి జగదీష్ రెడ్డి తమ శ్రేయోభిలాషులు అని తెలిపారు. రైతన్న సినిమాను మంత్రి వీక్షించడం గొప్ప బలాన్ని ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన వ్యవసాయ చట్టాలు రైతులకు శాపాలుగా పరిణమించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ చట్టం బీహార్‌లో అమలు పరిచినట్లు చెప్పారు. అక్కడ రైతులు కూలీలుగా మారారన్నారు. ఇప్పుడు దేశం మొత్తం విస్తరించాలి అన్నది కేంద్రం కుట్ర అన్నారు. అదే జరిగితే యావత్ భారతదేశంలో రైతులు ఉండరు? కూలీలుగా మారతారన్నారు. విద్యుత్ సవరణ చట్టం కార్పొరేట్ వ్యవస్థకు లబ్ది చేకూర్చేందుకేనన్నారు. సవరణ అంటూ జరిగితే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడినట్లేనన్నారు. అదే ఇతి వృత్తాంతంతో రైతన్న సినిమా తీసినట్లు ఆదరిస్తున్న ప్రజలకు ధన్యవాదాలన్నారు.

ఇరాన్‌లో లక్ష దాటిన కోవిడ్ మృతుల సంఖ్య

టెహ్రాన్, ఆగష్టు 19:: ఇరాన్‌లో కోవిడ్ మృతుల (అనీలతిట ఆవజీబిష్ఠబ) సంఖ్య అధికారికంగా లక్ష దాటింది. ఆ దేశ ఆరోగ్యశాఖ ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది. మరోవైపు కరోనా నియంత్రణ కోసం దేశవ్యాప్తంగా కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో 31,266 మందికి వైరస్ సంక్రమించగా.. 564 మంది మరణించారు. దీంతో దేశంలో ఇప్పటి వరకు నమోదు అయిన కేసుల సంఖ్య 4,587,683 కాగా, మరణాల సంఖ్య 100255కు చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ చెప్పింది. జూన్ నుంచి ఇరాన్‌లో అయిదో దశ ఇన్‌ఫెక్షన్లు మొదలైనట్లు తెలుస్తోంది. డెల్టా వేరియంట్ వల్ల ఆ కేసులు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తిరుమల, ఆగష్టు 19:: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న మంత్రి.. గురువారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వాదం చేయగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళిని పట్టిపీడిస్తున్న కరోనా మహమ్మారిని పూర్తి స్థాయిలో అరికట్టాల్సిందిగా స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. కేంద్ర మంత్రిగా భాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందినట్లు ఆయన వెల్లడించారు. మానవాళిని కనికరించి ప్రపంచాన్ని అభివృద్ధి చేసే దిశగా ఆశీస్సులు అందించాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరపిలేకుండా వాన

ఆదిలాబాద్, ఆగష్టు 19:: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వానతో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరుతున్నది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో అత్యధికంగా 12.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. బజార్‌హత్నూర్‌లో 12.04 సెంటీమీటర్లు, తాంసిలో 11.28 సెం.మీ., ఆదిలాబాద్‌లో 10.26 సెంటీమీటర్ల వర్షం కురింది. ఉమ్మడి జిల్లాలో భారీగా వర్షం కురవడంతో కడెం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. దీంతో కడెం జలాశయానికి 15,680 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. 18,244 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా.. ప్రస్తుతం 696.175 అడుగుల మేర నీరు ఉన్నది.

ఏపీలో మళ్లీ 1500 దాటిన పాజిటివ్ కేసులు!

అమరావతి, ఆగష్టు 19:ఆంధ్రప్రదేశ్ లో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్త పాజిటివ్ కేసులు మరోసారి 15 వందల మార్కును దాటాయి. గడిచిన 24 గంటల్లో 67,716 మంది శాంపిల్స్ ని పరీక్షించగా 1,501 మందికి పాజిటివ్ గా నిర్ధారణ అయింది. ఇదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 1,697 మంది కోలుకోగా? 10 మంది మృతి చెందారు. తాజా కేసులతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 19,98,603కి చేరింది. మొత్తం 19,69,169 మంది కోవిడ్ నుంచి కోలుకున్నారు. ఇప్పటి వరకు 13,696 మంది మృతి చెందారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15,738 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

జిల్లా వారీగా కరోనా పాజిటివ్ కేసుల వివరాలు చూస్తే.. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 315 కేసులు నమోదు కాగా.. అత్యల్పంగా విజయనగరం జిల్లాలో 6 కేసులు నమోదయ్యాయి. అనంతపురం జిల్లాలో 21, చిత్తూరు జిల్లాలో 174, గుంటూరు జిల్లాలో 141, కడప జిల్లాలో 49, కృష్ణాజిల్లాలో 147, కర్నూలు జిల్లాలో 10, నెల్లూరు జిల్లాలో 242, ప్రకాశం జిల్లాలో 107, శ్రీకాకుళం జిల్లాలో 30, విశాఖపట్నం జిల్లాలో 123, పశ్చిమగోదావరి జిల్లాలో 150 పాజిటివ్ కేసులు మోదయ్యాయి.

వైభవంగా 'ముత్యాలమ్మ' జాతర

ఖమ్మం, ఆగష్టు 19: ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో శ్రామణమాసం బోనాల జాతర మొదలైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ జాతర పండుగ వాతావరణం నెలకొంది. ఇంటింటికీ మామిడి తోరణాలను కట్టుకొని ఇండ్లను అందంగా అలంకరించుకున్నారు. గ్రామాల్లో ప్రజలంతా కలిసి ఒకేసారి ముత్యాలమ్మ పండుగను జరుపుకోవడంతో సందడి నెలకొంది.

ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే ఇండ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

అంతేకాక ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక నైవేద్యాన్ని వండి బోనం తయారు చేసి తలపై పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలెల్లారు. ముందుగా గ్రామాల్లోని బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలెల్లి ముత్యాలమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పాండురంగాపురంలో రజకులతో ముందుగా ముత్యాలమ్మ జాతర ప్రారంభమైంది. వేడుకల్లో రజక సంఘం నేతలు తంగెళ్లపల్లి శ్రీనివాస్, చింతపట్ల నర్సింహారావు, చిలుకూరి వెంకటేశ్వర్లు, దూదిగాని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భారత వైమానిక దళం కోసం అధునాతన చాఫ్ టెక్నాలజీని అభివృద్ధి చేసిన డిఆర్డీఓ

న్యూఢిల్లీ, ఆగష్టు 19:డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్డీఓ) భారత వైమానిక దళం (ఐఏఎఫ్) యుద్ధ విమానాలను శత్రు రాడార్ ముప్పు నుండి రక్షించడానికి ఒక అధునాతన చాఫ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. డిఆర్డీఓ లాబొరేటరీ అయిన డిఫెన్స్ లాబొరేటరీ జోధ్‌పూర్ అధునాతన చాఫ్ మెటీరియల్, చాఫ్ క్యాట్రిడ్జ్ -118/ఏ ను డిఆర్డీఓ పూణే ఆధారిత ప్రయోగశాల హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (హెచ్ఈఎంఆర్ఎల్) కలిసి ఐఏఎఫ్ గుణాత్మక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసింది. విజయవంతమైన యూజర్ ట్రయల్స్ పూర్తయిన తర్వాత ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఈ టెక్నాలజీని ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రారంభించింది.నేటి ఎలక్ట్రానిక్ యుద్ధ పద్ధతిలో, ఆధునిక రాడార్ ముప్పు కారణంగా యుద్ధ విమానాల మనుగడ ప్రధాన ఆందోళన కలిగిస్తుంది. విమానాల మనుగడను నిర్ధారించడానికి, ఇన్‌ఫ్రా-రెడ్, రాడార్ ముప్పునకు వ్యతిరేకంగా నిష్క్రియాత్మక జామింగ్‌ను అందించే కౌంటర్ మెజర్ డిస్పెన్సింగ్ సిస్టమ్ (సిఎండిఎస్) ఉపయోగించబడుతుంది. చాఫ్ అనేది యుద్ధ విమానాలను శత్రు రాడార్ బెదిరింపుల నుండి రక్షించడానికి ఉపయోగించే ఒక క్లిష్టమైన రక్షణ సాంకేతికత. ఈ సాంకేతికత ప్రాముఖ్యత ఏమిటంటే, గాలిలో మోహరించిన చాఫ్ మెటీరియల్ చాలా తక్కువ పరిమాణంలో యుద్ధ విమానాల భద్రతను నిర్ధారించడానికి శత్రువుల క్షిపణులను తిప్పికొట్టడానికి పని చేస్తుంది. భారత వైమానిక దళం వార్షిక రోలింగ్ అవసరాలను తీర్చడానికి పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేయడానికి దీనిని పరిశ్రమకు ఇచ్చారు.

సిరిసంపదలివ్వగా 'వరాలతల్లివి' - వరలక్ష్మీ శ్రావణమాస పూజలు 'నీకు' అమ్మా

పరిచయం:

మన దేశంలోని సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, మహోత్కృష్టంగా ఉంటాయి. ప్రకృతి అంతటిలోనూ దైవాన్ని దర్శించటం, ఆ దైవానికి ఆయా సందర్భాల్లో పూజలు జరపటం మన విశిష్టత. మన సంప్రదాయంలో ప్రతిరోజూ, ప్రతివారం, ప్రతి మాసం, ప్రతి తిథి, ప్రతి నక్షత్రమూ, అన్నిటికీ ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నది. మన తెలుగు వారు పాటించే సంప్రదాయం చాంద్రమాసం ఇందులో ప్రతి నెలకూ వైశిష్ట్యం ఉన్నప్పటికీ, శ్రావణ మాసం విభిన్నమైన ప్రత్యేకత కలిగిన నెల. స్త్రీలు నియమ నిష్టలతో పాటించే వ్రతాలు, పండుగలు ఈ నెల నుండి ప్రారంభమవుతాయి. అందుకనే ఈ నెలను 'వ్రతాల నెల' అని అంటారు. శ్రావణమాసంలో శుక్రవారాలు, మంగళవారాలు ప్రత్యేకతను కలిగినవి. శుక్రవారాలు వరలక్ష్మీ వ్రతం, మంగళవారం మంగళగౌరీ వ్రతము భక్తి ప్రపత్తులతో స్త్రీలు జరుపుకుంటారు.

శ్లోకం: లక్ష్మీం క్షీర సముద్ర రాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం,
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం
శ్రీ మన్మంద కటాక్షలబ్ధివిభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజం వందే ముకుందప్రియం॥

శ్రీ మహాలక్ష్మీ వైశిష్ట్యం:

వైకుంఠపురంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ క్షీరసాగరంలో ఉద్భవించింది. స్వర్గంలో స్వర్గలక్ష్మి, ఇంద్రలక్ష్మి, మహారాజులపాలిట రాజ్యలక్ష్మి, స్త్రీలకు ఆమె సౌభాగ్యలక్ష్మి, వరాలనిచ్చే వరలక్ష్మి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి, అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. మహాలక్ష్మి సంపదల తల్లి, సంపద అనే మాటకు సనాతన ధర్మంలో అనేక అర్థాలున్నాయి. ధనం, పుష్టి, ఆరోగ్యం, మిత్రత్వం, సౌమనస్యం, శాంతి, కలహంలేని పరిస్థితి బలం అనుకూలమైన కుటుంబం, కార్యసిద్ధి, విజయం, చిరునవ్వు, ఇవన్నీ లక్ష్మీ రూపాలు. ఈ సంపదలన్నింటి సమాహార స్వరూపాన్ని లక్ష్మీదేవిగా ఉపాసించారు మహర్షులు. ఇవన్నీ శ్రీవిభూతులు. వీటిని పొందాలంటే తగిన సాధన, అర్హత ఉండాలని ధార్మిక గ్రంథాలు బోధించాయి. మహాభారతంలో భీష్ముడు గొప్ప వృత్తాంతాన్ని వివరించారు. ఒకప్పుడు దైత్యులవద్ద లక్ష్మీదేవి నెలకొని సంపదలన్నీ ప్రసాదించింది. కానీ, ఒకసారి వారిని వదలి, యోగ్యుడైన ఇంద్రుడి ముందు ప్రత్యక్షమైంది.

'శ్రీమహాలక్ష్మీని' ఉద్దేశించి అమ్మా! నువెవ్వరు? ఎందుకు వచ్చావు? ఎక్కడినుంచి వస్తున్నావు? ఎక్కడికి వెళుతున్నావు? అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. అప్పుడు శ్రీమహాలక్ష్మీ దేవేంద్రుడితో సంభోదిస్తూ... ఒకప్పుడు దైత్యులు ధర్మనిరతులై, ధైర్యంతో సత్యాన్ని, సన్మార్గాన్ని వదలకుండా ఉండేవారు. అందుకే వారివద్ద నేనున్నాను. నా ఉనికితో వారంతా ఉన్నత స్థితిని, వైభవ విజయాలను అనుభవించారు. కానీ, స్వయంగా ధన మదంతో, విజయాల గర్వంతో సత్య, ధర్మాలను విడిచిపెట్టారు. ధర్మవిరుద్ధమైన భోగాల వెంట పడ్డారు. క్రోధాల్ని పెంచుకున్నారు. ఈర్ష్యాసూయలకు లోనయ్యారు. దానితో వారిని వదిలి పెట్టాను. పరిశుభ్రత, సదాచారం, క్రమశిక్షణ ఉన్నంతకాలం వారివద్ద ఉన్నాను. సధర్మాన్ని పాటించేవారివద్ద, ధైర్యంతో సత్కార్యాలు చేసేవారి చెంత నేనుండి కరుణిస్తాను. దానం, అధ్యయనం, దైవపూజ, గురుపూజ, అతిథిపూజలను పాటించేవారి ఇంట నేనుంటాను. ఇంటిని శుభ్రంగా ఉంచినవారు, స్త్రీలను గౌరవించేవారు, జితేంద్రియులు, సత్యవాదులు నా కరుణకు తగినవారు. దయామయులు, కృతజ్ఞులు, ప్రియంగా మృదువుగా మాట్లేవారు, నియమబద్ధంగా జీవించేవారు..... నా అనుగ్రహానికి పాత్రులు. వారిని నేను విడిచిపెట్టను, సంధ్యాకాలంలో నిద్రపోనివారు, తల్లిదండ్రులను, ఆచార్యులను గౌరవించేవారు, సంపదలకు అర్హులు. దానవులు భోగాలలసులై ఈ మర్యాదలన్నీ అతిక్రమించటంచేత వారి స్థానాలను నేను వదిలిపెట్టాను. ధర్మ, సత్య, శీలాదిసద్గుణాలను కలిగిఉన్న కారణంగా నిన్ను అనుగ్రహిస్తున్నాను. అన్న లక్ష్మీదేవి మాటలు విని ఇంద్రుడు ఆమెను పూజించాడు. ఈ వృత్తాంతము 'భారతం' శాంతి పర్వంలోనిది. పాలకులు, ప్రజలు భోగాలాలస వీడి నీతినియమాలతో జీవన విధానాన్ని అలవర్చుకోవడమే నిజమైన లక్ష్మీవ్రతం. మంచి లక్షణాల సమ్మేళనమే లక్ష్మీదేవి అనేది సారాంశం. పై ఇతివృత్తం ద్వారా భీష్ముడు ధర్మరాజుకు గొప్ప హితము బోధించాడు.

వరాలతల్లి 'వరలక్ష్మీ'

శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ నామాంకితమైన శుభదినం. సిరిసంపదలను కాంక్షించే మానవులందరూ శ్రద్ధగా శ్రీమహాలక్ష్మీని విశేష పూజలతో, వ్రతాచరణతో మొక్కుకొనే చక్కని సందర్భం. లక్ష్మీ అంటే సిరిసంపదలే కాదు. కళలూ, కాంతులనూ, శోభనలనూ, సౌందర్యాన్ని, శుభాలను సూచిస్తుంది. వాటన్నింటికీ వరలక్ష్మీదేవి అధిష్టాన దేవత. ఆమె అష్టలక్ష్మీ స్వరూపిణి. మనిషి యోగక్షేమాలకూ, సుఖజీవనానికీ, కావలసిన వనరులనూ ఎనిమిది భాగాలు చేస్తే అవన్నీ లక్ష్మీదేవి రూపాలే. "ఆదిలక్ష్మీ, ధాన్యలక్ష్మీ, ధైర్యలక్ష్మీ, గజలక్ష్మీ, సంతానలక్ష్మీ, విజయలక్ష్మీ, విద్యాలక్ష్మీ, ధనలక్ష్మీ" అని వరలక్ష్మీ తల్లి అష్టరూపాలు. ఆమెను పూజిస్తే అన్నీ లభిస్తాయి. మనకే కాదు, ఆమె సమస్త దేవతా వనితలను వశంచేసుకున్న మహారాణి. బ్రహ్మకూ, ఇంద్రుడికీ, గంగాధరుడుకీ వైభవాన్నిచ్చేది వరలక్ష్మీ తల్లి కటాక్షమే. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్ని ఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలి. ఆ రోజున వీలుకాకపోతే తరువాత వచ్చే శుక్రవారాలలో కూడా ఈవ్రతాన్ని చేసుకోవచ్చు. వరలక్ష్మీ వ్రత కథలోని నాయిక చారుమతి. చారుమతి ఈ సులక్షణాల వల్లనే వరలక్ష్మీ కరుణకు నోచుకుందని పురాణ సందేశం. వరలక్ష్మీ వ్రతానికి ఆది దేవతయైన లక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. సువాసినులందరూ చేసే ప్రాభవ వ్రతం. 'శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే' శుక్రవారం రోజున జరుపుకునే వరలక్ష్మీ వ్రతంతో ధన, కనక, వస్తు, వాహనాది సమృద్ధులకు మూలం. శ్రావణ శుక్రవార వ్రతాలతో పాపాలు తొలిగి లక్ష్మీ ప్రసన్నత కలిగి లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుంది.

వరలక్ష్మీ వ్రతం: పూజా విధానం.. పాటించాల్సిన నియమాలు, తోరం, వ్రత కథ

శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రావణం పేరుతో వచ్చే మాసం శ్రావణం. చాంద్రమాన ప్రకారం.. తెలుగు సంవత్సరాదిలో ఐదో నెల శ్రావణం. ఈ నెలలో నోములు, వ్రతాలు, పూజలకు ప్రశస్తి. భక్తితో వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరలక్ష్మీ దేవి. శ్రీమహావిష్ణువు దేవేరి లక్ష్మీదేవి అష్టావతారాలలో వరలక్ష్మీ ఒకరు. ఆ వరలక్ష్మీ దేవి పేరున ఉన్న వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాన్నిచేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది. సకల శుభాలుకలుగుతాయి. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

వ్రత విధానం

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే రోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి. ఇంట్లోని పూజా మందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటుచేసుకోవాలి. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటుచేసుకోవాలి. అమ్మవారి ఫొటో లేదా రూపును తయారుచేసి అమర్చుకోవాలి. పూజాసామగ్రి, తోరాలు, అక్షతలు, పసుపు గణపతిని ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి.

వరలక్ష్మి పూజా సామగ్రి:

పసుపు, కుంకుమ, గంధం, విడిపూలు, పూల మాలలు, తమలపాకులు, 30 వక్కలు, ఖర్జూరాలు, అగరవత్తులు, కర్పూరం, చిల్లర పైసలు, తెల్లని వస్త్రం, రవికల గుడ్డ, మామిడి ఆకులు, ఐదు రకాల పండ్లు, అమ్మవారి ఫోటో, కలశం, కొబ్బరి కాయలు తెల్ల దారం లేదా నోము దారం, లేదా పసుపు రాసిన కంకణం, ఇంటిలో తయారుచేసిన నైవేద్యాలు, బియ్యం, పంచామృతాలు. దీపపు కుందులు, ఒత్తులు, నెయ్యి.

వరమహాలక్ష్మీ అమ్మవారి కలశ స్థాపన, అలంకరణ

శ్రావణమాసం పేరు చెప్పగానే గుర్తుకువచ్చేది వరలక్ష్మీ వ్రతం. తెలుగు రాష్ట్రాల్లోని హిందువులు అందరూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. లేకపోతే ఎవరైనా చేస్తే వెళ్లి తీర్థప్రసాదాలు, శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం రోజున తెల్లవారుజామునే నిద్రలేచి, అభ్యంగన స్నానాన్ని ఆచరించాలి. ఇంటికి ఈశాన్య భాగంలో ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి, మండపాన్ని ఏర్పాటుచేయాలి. మండపంలో బియ్యం పోసి అందంగా తీర్చిదిద్ది, అందులో కలశాన్ని ఉంచి, మర్రి, మామిడి, మేడి, జువ్వి, రావి చిగుళ్లను అందులో వేయాలి. కలశంపై కొబ్బరికాయ ఉంచి, ఎరుపు రంగు రవిక గుడ్డను దానికి అలంకరించాలి. తొలుత కొబ్బరికాయను నునుపుగా చేసి, ఎక్కువ వెడల్పు ఉండే భాగంలో అమ్మవారి ముఖాన్ని తయారుచేయాలి. ముఖం ఏర్పాటుచేసే భాగంలోనే పసుపును ముద్దలాచేసి కొబ్బరికాయకు అద్దాలి. తర్వాత కొద్దిగా పొడి పసుపును తీసుకుని దానిపై చల్లాలి. అనంతరం మైదా పిండి తీసుకుని, అందులో కొంచెం పసుపువేసి కలపాలి. ఈ ముద్దను వేలితో బలపంలా వత్తుకుని అమ్మవారికి చెవులు, ముక్కును తయారుచేయాలి. ముందు చెవులు, తర్వాత ముక్కును కొబ్బరికాయకు పసుపు అద్దిన భాగంలో ఉంచాలి. అనంతరం సన్నని అగ్గిపుల్లతో కళ్లను ముక్కుకు ఇరువైపులా మార్కింగ్ చేసుకోవాలి. కనుబొమలు కూడా గీసి, కను పాపలకు బియ్యపు పిండి, తర్వాత కాటుకను అద్దాలి. దీనిని పక్కన ఉంచి, కలశానికి ఓ పెద్ద చెంబును తీసుకుని దానికి మధ్యలో ఓ కర్రను కట్టాలి. మరో మర చెంబును తీసుకుని ఎడమవైపునకు ఎక్కువగా ఉండేలా మరో చిన్న కర్రను కట్టి, దాని చుట్టూ రవికల గుడ్డను చుట్టాలి. పెద్దదానిపై చిన్న మర చెంబును ఉంచి, చీరలో మూడో వంతు భాగాన్ని కుచ్చిళ్లుగా వేసి అలకరించాలి. తర్వాత చేతులను అమ్మవారికి అమర్చాలి. అభయ హస్తం కొద్దిగా వెనుక్కు, వదరహస్తం కొద్దిగా ముందుకు ఉండేలా చూసుకోవాలి. కలశంపై అమ్మవారు నిలబడటానికి వీలుగా బేబీ పిల్లోలా ఉండే ఆకారాన్ని ఉంచాలి. అమ్మవారి ముఖం కలశంపైకి ఉంచడానికి ముందే నగలను అలంకరించాలి. అమ్మవారి మెడలా వాటిపై చిన్న మట్టుగిన్నె ఉంచాలి. ఇది కంఠంలా ఉంటుంది కాబట్టి, కంఠాభారణం ఉంచాలి. తర్వాత చెవుపోగులు, ముక్కుపుడక ఉంచి, కలశంపై ముఖాన్ని ఏర్పాటుచేయాలి. తర్వాత బరువు తక్కువ ఉండే కిరీటం శిరస్సుపైన ఉంచాలి. తర్వాత వరలక్ష్మీదేవిని ఆవాహనం చేయాలి. వరలక్ష్మీని కీర్తిస్తూ ధ్యాన ఆవాహన షోడశోపచారాలు, అష్టోత్తరశత నామాలతో అర్చన చేయాలి. అమ్మవారిని అష్టోత్తర శత నామాలలో ఒక్కొక్క నామానికి ఓ విశిష్టత ఉంది. వేదాల్లో వీటికి సంబంధించి 108 కథలున్నాయి. బ్రహ్మ వైవర్త, విష్ణు, స్కంద, పద్మ, ఖాండ పురాణాల్లో లక్ష్మీదేవి వైభోగం, పూజాప్రాశస్త్యం గురించి పేర్కొన్నారు.

తోరం తయారు చేసుకోవడం:

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాయాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి. ఆవిధంగా తోరాలను తయారుచేసుకున్న తరువాత పూజకు సిద్ధంకావాలి.

తోరపూజ

తోరాన్ని అమ్మవారి వద్ద ఉంచి అక్షతలతో తోరపూజ మంత్రపఠనంతో పూజించాలి. ఆ శ్లోకం చదువుతూ తోరం కట్టుకోవాలి.

బద్నామి దక్షిణేహస్తే నవసూత్రం శుభప్రదం
పుత్రపౌత్రాభివృద్ధించ మమ సౌభాగ్యం దేహిమే రమే

వరలక్ష్మీ వ్రత కథ

పూర్వం శౌనకాది మహర్షులను ఉద్దేశించి సూత మహర్షి ఇలా చెప్పారు. మునులారా! స్త్రీలకు సౌభాగ్యాన్ని ప్రసాదించే ఒక వ్రతాన్ని పరమ శివుడు పార్వతికి చెప్పారు. లోకోపకారం కోరి ఆ వ్రతాన్ని గురించి మీకు తెలియజేస్తాను .శ్రద్ధగా వినండి అన్నారు, పరమేశ్వరుడు ఒకనాడు తన భస్మసింహాసనంపై కూర్చుని ఉండగా నారదుడు మహర్షి ఇంద్రాది దిక్పాలకులు స్తుతి స్తోత్రాలతో ఆయను కీర్తిస్తున్నారు. ఆమహత్తర ఆనంద సమయంలో పార్వతీదేవి పరమేశ్వరుడ్ని ఉద్దేశించి ప్రాణేశ్వరా! స్త్రీలు సర్వసౌభ్యాలు పొంది, పుత్ర పౌత్రాభివృద్ధిగా తరించుటకు తగిన వ్రతం ఒకదానిని చెప్పండి అని కోరింది. అందుకా త్రినేత్రుడు దేవీ! నీవు కోరినవిధంగా స్త్రీలకు సకల శుభాలు కలిగించే వ్రతం ఒకటి ఉన్నది. అది వరలక్ష్మీవ్రతం. దానిని శ్రావణమాసం రెండో శుక్రవారం నాడు ఆచరించాలని తెలిపాడు. అప్పుడు పార్వతీదేవి దేవా! ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆదిదేవతలు ఎవరుచేశారు? ఈ వ్రతాన్ని ఎలా చేయాలో వివరంగా చెప్పండని కోరింది. కాత్యాయనీ పూర్వకాలంలో మగధ దేశంలో కుండినం అనే పట్టణం ఒకటి ఉండేది. ఆపట్టణం బంగారు కుడ్యములతో రమణీయంగా ఉండేది. ఆ పురంలో చారుమతి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె సుగుణవతి. వినయ విధేయతలు, భక్తిగౌరవాలు గలయోగ్యురాలు. ప్రతిరోజూ ప్రాతఃకాలాన నిద్రలేచి భర్త పాదాలకు నమస్కరించి ప్రాతఃకాల గృహకృత్యాలను పూర్తిచేసుకుని అత్తమామలను సేవలో తరించేంది.

వరలక్ష్మీ సాక్షాత్కారం

వరలక్ష్మీ వ్రతానికి ఆదిదేవతయైన వరలక్ష్మీదేవి ఒకనాటి రాత్రి సమయంలో చారుమతికి కలలో సాక్షాత్కరించింది. ఓ చారుమతీ ఈ శ్రావణ పౌర్ణమి నాటికి ముందు వచ్చే శుక్రవారం నాడు నన్ను పూజించు... నీవు కోరిన వరాలు, కానుకలను ఇస్తానని చెప్పి అంతర్ధానమైంది. చారుమతి సంతోషించి. హే జననీ! నీకృపా కటాక్షాలు కలిగినవారు ధన్యులు. వారు సంపన్నులుగా, విద్వాంసులుగా మన్ననలు పొందుతారు. ఓ పావనీ! నా పూర్వజన్మ సుకృతం వల్ల నీ దర్శనం నాకుకలిగింది' అని పరిపరివిధాల వరలక్ష్మీని స్తుతించింది. అంతలోనే మేల్కొన్న చారుమతి అదంతా కలగా గుర్తించి తన కలను భర్తకు, అత్తమామలకు తెలియజేసింది. వారు చాలా సంతోషించి చారుమతిని వరలక్ష్మీవ్రతాన్ని చేసుకోమని చెప్పారు. పురంలోని మహిళలు చారుమతి కలను గురించివిని వారు కూడా పౌర్ణమి ముందు రాబోయే శ్రావణ శుక్రవారం కోసం ఎదురుచూడసాగారు. శ్రావణ శుక్రవారం రోజున పట్టణంలోని స్త్రీలందరూ ఉదయాన్నే లేచి తలారాస్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి చారుమతి గృహానికి చేరుకున్నారు. చారుమతి తన గృహంలో మండపం ఏర్పాటుచేసి ఆ మండపంపై బియ్యంపోసి పంచపల్లవాలైన రావి, జువ్వి, మర్రి, మామిడి, ఉత్తరేణి మొదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని సంకల్ప విధులతో సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే ! అంటూ ఆహ్వానించి ప్రతిష్టించింది. అమ్మవారిని షోడశోపచారాలతో పూజించి, భక్ష్య, భోజ్యాలను నివేదించారు.

తొమ్మిది పోగుల తోరాన్ని చేతికి కట్టుకుని, ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. మొదటి ప్రదక్షిణ చేయగానే కాలి అందియలు ఘల్లుఘల్లున మోగాయి. రెండో ప్రదక్షిణ చేయగానే హస్తాలకు నవరత్నఖచిత కంకణాలు ధగధగా మెరవసాగాయి. మూడో ప్రదక్షిణ చేయగానే అందరూ సర్వాభరణభూషితులయ్యారు. వారు చేసిన వరలక్ష్మీ వ్రతం ఫలితంగా చారుమతి గృహంతో పాటు, ఆపట్టణంలో ఇతర స్త్రీల ఇళ్లు కూడా ధన, కనక, వస్తు వాహనాలతో నిండిపోయాయి. వారి వారి ఇళ్ల నుంచి గజ తరగరథ వాహనాలతో వచ్చి ఇళ్లకుతీసుకెళ్లారు.

వారంతా మార్గమధ్యంలో చారుమతిని వేనోళ్ళ పొగుడుతూ ఆమెకు వరలక్ష్మీ దేవి కలలో సాక్షాత్కరించి అనుగ్రహించగా ఆమె చేసిన వ్రతంతో తమని కూడా మహద్భాగ్యవంతులను చేసిందని ప్రశంసించారు. వారంతా ఏటా వరలక్ష్మీవ్రతం చేసి సకల సౌభాగ్యాలతో సిరిసంపదలుకలిగి, సుఖజీవనం గడిపి ముక్తిని పొందారు. మునులారా! శివుడుపార్వతికి ఉపదేశించిన ఈ వరలక్ష్మీవ్రత విధానాన్ని సవిస్తరంగా మీకువివరించాను.

ఈ కథ విన్నా, ఈ వ్రతం చేసినా, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు సిద్ధిస్తాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు చెప్పారు. ఈ కథ విని అక్షతలు శిరసుపై వేసుకోవాలి. ఆ తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. అందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చి, పూజ చేసినవారు కూడా వాటిని తీసుకోవాలి. అమ్మవారికి పెట్టిన నైవేద్యాన్ని వాళ్లే ఆరగించాలి. రాత్రి ఉపవాసం ఉండి, భక్తితో వేడుకుంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీని పూజించడం చాలా శ్రేష్ఠం. శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు దక్కుతాయి. సర్వమంగళ సంప్రాప్తి, సకలాభీష్టం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఈ వ్రతం చేస్తారు. వరలక్ష్మీ వ్రతంతో మనకు సర్వం ప్రాప్తిస్తాయి. శ్రీ (ధనం), భూ (భూమి), సరస్వతి (చదువు), ప్రీతి ((ప్రేమ), కీర్తి, శాంతి, తుష్టి (సంతోషం), పుష్టి (బలం) కలుగుతాయి. నవకాయ పిండి వంటలు, ఫలాలను నైవేద్యంగా సమర్పించి, తొమ్మిది దారాలతో తయారు చేసిన తోరాన్ని అర్చించి, దాన్ని కుడిచేతికి కట్టుకోవాలి. భక్తితో ప్రదక్షిణపూర్వక నమస్కారాలు పూర్తిచేసి ఇంటికి వచ్చిన ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవాలి. వరలక్ష్మీ తల్లి దీవెనలతో ఆరోగ్య ఐశ్వర్యాల అభివృద్ధితో సర్వమానవాళి వర్ధిల్లుగాక!

సర్వేజనాః సుఖినోభవంతు.

(నేడు వరలక్ష్మి వ్రతం సందర్భంగా...)

-శారద శృంగేరి
9490 26 1119

2018 ఉ2019 బ్యాచీకి చెందిన ఐటిఎస్ ప్రొబేషనర్లతో ముచ్చటించిన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర

న్యూఢిల్లీ, ఆగష్టు 19:భారతీయ టెలికమ్యూనికేషన్ సర్వీసు (ఇండియన్ టెలికమ్యూనికేషన్స్‌సర్వీస్) 2018, 2019 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ అధికారులతో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర గురువారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో ముచ్చటించారు.

ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ లండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడి ఇఎం)లో భారతీయ టెలికమ్యూనికేషన్ సేవల (ఐటిఎస్) అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఈ చర్చ జరిగింది.

యూనియన్ ఆఫ్ ఇండియాకు చెందిన కేంద్ర సివిల్ సర్వీసులలో (గెజిటెడ్) పోస్టులలో ఐటిఎస్ ఏ గ్రూపుకు చెందింది. టెలికమ్యూనికేషన్లకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వానికి సాంకేతిక, నిర్వాహక విధులను ఈ సర్వీసు నిర్వహిస్తుంది. కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని టెలికమ్యూనికేషన్ల విభాగం (డిఒటి) ఐటిఎస్ అధికారులకు సంబంధించిన కేడర్ నియంత్రణ, కేడర్ నిర్మాణం, భర్తీ, డిప్యూటేషన్, వేతనం, అలవెన్సులు, క్రమశిక్ష అంశాలకు సంబంధించిన విధాన నిర్ణయాల బాధ్యతను నిర్వరిస్తుంది.

టెలికమ్యూనికేషన్ విభాగానికి చెందిన విధాన సూత్రీకరణ, విధాన అమలుకు సంబంధించిన అంశాలపై ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీసు అధికారులు పని చేస్తారు. ఐటిఎస్ అధికారులు దేశంలోని అన్ని లైసెన్సు సేవా ప్రాంతాలు, పెద్ద టెలికాం జిల్లాలలోనూ టెలిగ్రాఫ్ అథారిటీ పాత్రను నిర్వర్తిస్తారు. సర్వీసు ప్రొవైడర్లు లైసెన్సు షరతులకు కట్టుబడి ఉండేలా చూడడమే కాక, నెట్‌వర్క్ భద్రతా సమస్యల బాధ్యతలను తీసుకోవడమే కాక, చట్టవ్యతిరేక / రహస్య టెలికాం కార్యకలాపాల పై కఠిన చర్యలు తీసుకుంటారు.

రవాణాశాఖ కార్యాలయాన్ని సందర్శించిన సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ

కరీంనగర్, ఆగష్టు 19: రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు, ఏటా 10 శాతం మరణాల తగ్గింపు లక్ష్యంతో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు ఈ రోజు కరీంనగర్ రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించారు.

కేంద్ర ప్రభుత్వ రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో ఢిల్లీ ఇంట్రిగ్రేటెడ్ మల్టి మోడల్ ట్రాన్సిట్ సిస్టం(ఆఎఓూ), ట్రాన్స్‌పోర్టు రీసెర్చ్ ఇంజ్యూరి ప్రివెన్షన్ ప్రోగ్రాం,(ఖీఎఖఖ), ఎమి ఢిల్లీ భాగస్వామ్యంతో ఈ కమిటీ ఏర్పాటు అయింది. దేశ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల తీరుతెన్నులను విశ్లేషిస్తున్న ఈ కమిటీ ప్రమాదాల నివారణకు ప్రభుత్వ విభాగాలు తీసుకుంటున్న చర్యలు, సమన్వయంపై అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తుంది.

క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా కమిటీ సభ్యులు నలిన్ బిండ్లేష్, విష్ణు అబ్బగాని, శుభం గౌర్ ఈ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్‌తో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా రవాణా కార్యాలయంలో లైసెన్స్‌ల జారీ విధానం, వాహనాలకు ఫిట్‌నెస్‌ల జారీ విధానంతో పాటు ప్రమాదాల నివారణకు రవాణ శాఖ తీసుకుంటున్న చర్యల గురించి డీటీసీ చంద్ర శేఖర్ గౌడ్ వారికి వివరించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాలు, వాహన తనిఖీలు, విధిస్తున్న జరిమానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐ రజనీ దేవి పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గుర్తింపు ఉంటుంది -జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 19:(నేటినిజం ప్రతినిధి): కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్ట్మెంట్లో కచ్చితంగా గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారుగత నెలలో ఫంక్షనల్ వర్టికల్ వారీగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు సిబ్బందికి అప్రిసియేషన్ సర్టిఫికెట్ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ అందజేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత నెలలో వర్టికల్ వారిగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను గుర్తించి అప్రిసియేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ప్రత